



- నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య
- వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో రగిలిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి

దొరతనంపై రణకేతనం

6

ప్రైవేట్ స్కూళ్లా..! బుక్ స్టాళ్లా!!



మానుకోటలోని ఓ ప్రైవేటు హై స్కూల్‌లో పుస్తకాలు విక్రయిస్తున్న స్టోర్‌రూంలో ధర్నా చేస్తున్న డీఎస్ఎఫ్ఐ నేతలు

- బడుల్లోనే యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాల విక్రయాలు
- వ్యాపార సముదాయాలను మరిపిస్తున్న పాఠశాలలు
- అధిక ఫీజుల నియంత్రణపై పట్టింపులేని అధికారులు
- జిల్లాలో 108 స్కూళ్లు, 37, 236 మంది విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, టై, బెల్టుల అమ్మకాలతో బుక్‌స్టాల్స్, బట్టల దుకాణాలను మరిపిస్తున్నాయి. ప్రైవేటు బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యనందించాల్సిన యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా విద్యతో వ్యాపారం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా నర్సరీ మొదలుకొని 10వ తరగతి వరకు పదుల సంఖ్యలో స్టడీ మెటీరియల్ అంటూ వేలాది రూపాయలకు విక్రయిస్తూ ఏటా లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లలోనే పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్, టై, బెల్టులు, యూనిఫాం విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘాలు స్టోర్ రూంల ఎదుట ధర్నాలు, నిరసనలు తెలుపుతున్నారు. కొన్ని పాఠశాలల్లో మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు బుక్స్ స్టోర్ రూంలను సీజ్ చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా పాఠశాలల్లోనే పుస్తకాలను విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 108 ప్రైవేటు పాఠశాలలుండగా వాటిల్లో 37,236 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఫీజులు అధికం.. వసతులు అంతంతే

ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్న యాజమాన్యాలు వసతులు కల్పించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో సామర్థ్యానికి మించి ఇరుకు గదుల్లో 30 నుంచి 50 వరకు విద్యార్థులను కూర్చోబెట్టి పాఠ్యాంశాలు బోధిస్తుండటంతో పాఠ్యాంశాలు అర్థమయ్యేదెలా? అని తల్లిదండ్రులు వాపోతున్నారు. మరోవైపు కొన్ని పాఠశాలలో వేలాది మంది విద్యార్థులుంటే టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు పదుల సంఖ్యలో ఉండటం వలన క్యూలో నిలబడి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇక నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

షాపులుగా మారిన పాఠశాలలు

పాఠశాలలు ప్రారంభమైన నాటి నుంచే ప్రైవేటు పాఠశాలలు వ్యాపార సముదాయాలుగా మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలల పునఃప్రారంభం నుంచే స్కూళ్లకు వచ్చిన విద్యార్థుల నుంచి స్టడీ మెటీరియల్ కొనాలనే ఉపాధ్యాయుల ఒత్తిడితో తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రారంభంలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాఠ్యాంశాలు మొదలుపెట్టాల్సిన ఉపాధ్యాయులు టై, బెల్టులు, యూనిఫాం, షూ, స్టడీ మెటీరియల్ తప్పనిసరని చెప్పటంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆర్థికభారంతో సతమతమవుతున్నారు.



బయ్యారంలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌లో పుస్తకాలు విక్రయిస్తున్న స్టోర్ రూంను సీజ్ చేస్తున్న మండల విద్యాశాఖాధికారి, ఏఐఎస్ఎఫ్ నేతలు

అధిక ఫీజుల నియంత్రణపై అధికారుల పట్టింపేది...

కూలీనాలీ పనులు చేసుకొని పిల్లలను

(మిగతా 8వ పేజీలో...)

బుక్‌స్టాళ్లను మరిపిస్తున్న ప్రైవేటు పాఠశాలలు



గంధసిరి జ్యోతిబసు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్, టై, బెల్టులు విక్రయిస్తూ బుక్‌స్టాళ్లను మరిపిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో విక్రయించే అవకాశం లేనప్పటికీ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రవేటు పాఠశాలలపై జిల్లా విద్యాశాఖాధికారులు తనిఖీలు చేపట్టి, చర్యలు తీసుకోవాలి.



కొమ్ముగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

అభ్యసన నైపుణ్యాలు, పర్యావరణంపై దృష్టి సారించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అభ్యసనా నైపుణ్యాలు, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. బ్రాహ్మణపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, కొమ్ముగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలో సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం కొమ్ముగూడెం పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దడం జరుగుతుందని, అనేక సౌకర్యాలు కల్పిస్తూ అత్యుత్తమ సాంకేతిక విద్యాబోధనను అందించడం కోసం విద్యాశాఖను బలోపేతం చేస్తున్నామన్నారు.

పిల్లల అభ్యసన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం కలిసి పనిచేయాలన్నారు. పాఠశాలలు ఉత్తమ పాఠశాలలుగా ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న పాఠశాలల అదనపు గదులను వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే పిల్లలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎస్వో అప్పారావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చుక్క రమేష్ (ఫైల్)

ప్రాణం తీసిన పోలీసు భయం

- చల్వాయిలో ఉరివేసుకొని నిరుపేద యువకుడి బలవన్మరణం
- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్టింగ్‌లు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం



రమేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న అమ్మమ్మ విశాల

- సెల్‌ఫోన్ స్వాధీనం.. స్టేషన్‌కు రావాలని ఆదేశం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య
- రాస్తారోకో చేసిన బంధువులు, బీఆర్ఎస్ శ్రేణులు
- వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు నమోదు

6

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు

- పక్కా ప్రణాళికతో అమలు చేయాలి
- మహాజాతర ఏర్పాట్ల పూర్తికి ఆరునెలల సమయం ఉంది
- క్షేత్రస్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్‌పై నివేదిక సమర్పించాలి
- ఆదివాసి సంప్రదాయాలకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు
- భూసేకరణకు పూజారులు, గిరిజనులు సహకరించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్



మేడారం పరిసరాలను పరిశీలిస్తున్న శైలజారామయ్యర్



వనదేవతల గద్దెల డిజైన్

ములుగు/తాడ్వాయి జూలై 3 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి జరిగే మేడారం మహాజాతరకు పక్కా ప్రణాళికలతో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గద్దెల పరిసరాలను, క్యూ లైన్లు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, కన్నెపెల్లి సారలమ్మగుడి, చిలకలగుట్ట పరిసరాలు జిల్లా కలెక్టర్ దివాకర, సీఎస్ సలహాదారు గోవింద హరితో కలిసి పరిశీలించారు. అనంతరం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని (మిగతా 8లో...)



ఉరి వేసుకొని కోడలు.. గుండెపోటుతో మామ..

ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి.. అవుతాపురంలో విషాదం



ఝాన్సీ(ఫైల్)

పెద్దవంగర, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. వేముల సంతోష్-వేముల ఝాన్సీ 2011లో వివాహం జరిగింది. వారికి కుమారుడు అఖిల్ తేజ, కుమార్తె అభిదామాని ఉన్నారు. సంతోష్ పెద్దవంగర మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో సీఆర్పీగా, ఝాన్సీ తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. ఝాన్సీ పని చేస్తున్న విద్యసంస్థలో ఒకరు ఆమెను మందలించారు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఝాన్సీ (35) గురువారం ఇంటివద్దనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, రెండు రోజుల కిందట విద్యా సంస్థలో ఒకరు మందలించారని తీవ్ర మనస్థాపం చెందింది. పాఠశాలకు ఇక వెళ్లనని భర్తకు చెప్పి ఇంటి వద్దనే ఉంటున్నది. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఝాన్సీ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుంది. కోడలి మరణవార్త తెలియడంతో గత కొద్ది రోజులుగా గుండెనొప్పితో బాధపడుతున్న వేముల లక్ష్మయ్య మామ గుండెపోటుతో మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే ఒకే ఇంట్లో కోడలు, మామ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మయ్యకు భార్య సరోజన కుమారులు ప్రకాష్, సంతోష్ ఉన్నారు. ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై క్రాంతికిరణ్ వివరణ కోరగా.. ఘటన స్థలాన్ని పరిశీలించామని, ఫిర్యాదు అందిన వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు అందచేసి సన్మానిస్తున్న నూకల మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, మెమెంటులు అందజేసి శాలువాతో సత్కరించి ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన కుమారుడు మహేందర్‌రెడ్డి 2024-25 విద్యాసంవత్సరంలో ఎస్సెస్సీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను నగదు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరం ఎస్సెస్సీ ఫలితాల్లో 565 మార్కులు సాధించిన వెంపటి విఘ్నేష్‌కు రూ.10 వేలు, 554 మార్కులు సాధించిన ధనుంజయ్‌కు రూ. 6 వేలు, 534 మార్కులు సాధించిన శివకుమార్‌కు రూ. 4 వేలతో పాటు 500 మార్కులె దాటిన 8 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున నగదు, మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. 2025 జేఈఈ మెయిన్స్ ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీలో ప్రవేశం పొందిన సాయిలేఖ్య, ప్రశాంత్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ తల్లిదండ్రులు మెచ్చేలా...పాఠశాలకు పేరు తెచ్చేలా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమై విద్య అందుతుందని, ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదని ప్రతిభ గల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటారని తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి చదివించాలని సూచించారు. అనంతరం నూకల మహేందర్‌రెడ్డిని సన్మానించారు. హెచ్‌ఎం ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఎస్. జి.లక్ష్మీ, డీఎస్వో అప్పారావు, ఏఎంసీ చైర్మన్ చిరంజీవి, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, ఉప్పలయ్య, సోహన్‌బి, శ్రీనివాసరావు, తిరుపతి, సతీష్‌కుమార్, సోమేశ్వర్, ఝాన్సీ, వీరభద్రం, కవిత, వెంకటేశ్వర్లు, ఆవునూరి రవి పాల్గొన్నారు.


కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారకస్తూపం


దొరతనంపై రణకేతనం

- నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య
- వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటం
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో రగిలిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో ఆయన 79వ వర్ధంతి

దేవరుప్పుల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం.. భుక్తికోసం.. బానిస బంధాల విముక్తి కోసం.. వెట్టిచాకిరి నిర్మూలన కోసం నడుం బిగించి తెలంగాణ గడ్డపై నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. నైజాం సర్కార్ దేశ్‌ముఖ్‌ల కుట్రలతో చిందిన కొమురయ్య రక్తంతో తెలంగాణ రక్త సిక్తమైంది. బాంచెన్ దొర అంటూ దొర పెత్తనంలో నలిగిన వాళ్లను బందూకులు చేతబట్టి పోరాడే దిశగా నడిపించిన ధీరుడు దొడ్డి కొమురయ్య. రజాకార్లు, దేశ్‌ముఖ్‌ల చర్యలను నిలదీస్తూ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కొమురయ్యను దేశ్‌ముఖ్‌ల గుండాలు కాల్చి చంపి నేటికి(జూలై 4)79 ఏళ్లు పూర్తవుతున్నాయి.

తూటాలకు ఎదురొడ్డి..

విస్నూర్ ప్రాంత గ్రామాలతో పాటు కడవెండిలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా 1946 జూలై 3న ఉద్యమకారులతో గ్రామస్థులు సమావేశమయ్యారు. జూలై 4న విస్నూర్ దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి చర్యలకు నిరసనగా కడవెండి ప్రజలు అస్నాల రాజన్న ఇంటి ముందు నుంచి ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు వస్తున్న సమయంలో దక్షిణం వైపు ఉన్న ఇంట్లో నుంచి దేశ్‌ముఖ్ గుండాలు తూటాల వర్షం కురిపించారు. ఊరేగింపులో ముందు వరుసలో ఉన్న దొడ్డి కొమురయ్య, దొడ్డి మల్లయ్యలకు తూటాలు తగిలాయి. కొమురయ్య పొట్టలోకి ఎక్కువ తూటాలు దూసుకు పోవటంతో రాత్రి పది గంటల సమయంలో నేలకొరిగి అమరుడయ్యాడు. కొమురయ్య సోదరుడు దొడ్డి మల్లయ్య ప్రాణాపాయస్థితి నుంచి బయట పడ్డాడు.


దొడ్డి కొమురయ్య (ఊహా చిత్రం)

ఎగిసిన ఉద్యమం..

కొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంత మంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన తొలి అమర వీరుడిగా కొమురయ్య పేరు, ఊరు చరిత్ర పుటల్లో నిలిచి పోయింది. కొమురయ్య అమరుడైన నాటినుంచి నేటి వరకు కడవెండి గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభలను విప్లవ, కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తూనే ఉన్నాయి. 50వ వర్ధంతి సభను సీపీఐ ఆధ్వర్యంలో 1996లో పెద్ద ఎత్తున నిర్వహించారు. దొడ్డి కొమురయ్య స్మారక భవనం నిర్మిస్తామని సీపీఐ హామీ ఇచ్చి నెరవేర్చింది. ఆయన పేరిట స్మారక భవనం నిర్మించుకోగా పలు కార్యక్రమాలకు ఉపయోగంలోకి వచ్చింది.

దొరపై తిరబడి..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో 1928లో దొడ్డి గట్టమ్మ, కొండయ్యల దంపతులకు కొమురయ్య జన్మించాడు. కొమురయ్యకు 16వ ఏటా 1944లో కొమురమ్మతో వివాహం జరిగింది. పాలకుర్తి మండలం విస్నూర్ కేంద్రంగా 60గ్రామాలను దేశ్‌ముఖ్ రాపాక వెంకట రాంచంద్రారెడ్డి, ఆయన భార్య జానమ్మ దొరసాని, కుమారుడు బాబుదొర ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ పీడించేవారు. 1943లో ఆంధ్ర మహాసభలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కడవెండికి చెందిన నల్ల నర్సింహులు, దొడ్డి మల్లయ్య, దావిద్‌రెడ్డి, వడ్డెనర్సయ్య, నల్ల కొండయ్య, మచ్చ రామయ్య, జంపాల లింగయ్య, పంతం లచ్చయ్య, పాముకుంట్ల ముత్తిలింగం, మాశెట్టి రాంచెంద్రయ్య, ఎర్రంరెడ్డి రామకృష్ణారెడ్డి, పైండ్ల యాదగిరి తదితరులు నైజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఈ ప్రాంతం నుంచి సహకరించారు. 1946లో నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. గ్రామరక్షక దళాల పేరుతో నాడు గుత్పల సంఘాలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారు.

నేడు కడవెండిలో వర్ధంతి సభ

సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కడవెండిలో నిర్వహించే కొమురయ్య 79వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య కోరారు. ఉదయం 11గంటలకు సభ ప్రారంభమవుతుందని కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, రాష్ట్ర సమితీ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్. రాజారెడ్డిలు హాజరవుతారని వెల్లడించారు.


ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు

ఉగ్రప్రభ త్వరితమాత అలంకరణలో అమ్మవారు

8వ రోజుకు చేరిన భద్రకాళి శాకంబరీ వేడుకలు

వరంగల్ కల్చరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ వేడుకలు గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యపూజ అనంతరం అష్టమికి ఆది దేవత శంకరుడు దశమహా విద్యల్లో కాళీక్రమంను అనుసరించి ఉదయం ఉగ్రప్రభ.. జ్ఞానశక్తిని త్వరితమాత గాను అలంకరించి పూజారాధన చేశారు. అమ్మవారి విభూతి అయిన ఈ ఉగ్రపభ మాతకు ప్రత్యంగిరా అనే నామం కూడా ఉంది. ఈ అమ్మవారు భక్తులను అనుగ్రహించి అభయమిస్తుందని అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. కాగా, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పోలీసు అధికారుల సమీక్ష

ఈ నెల ఆషాడశుద్ధ పౌర్ణమి రోజు భద్రకాళి అమ్మవారి శాకంబరీ అలంకరణ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయంలో క్యూలైన్లు, ప్రసాదం, మంచినీరు, బాదంపాలు, మజ్జిగ పంపిణీ, వాటర్‌ప్రూఫ్ పరదాలు ఏర్పాటు చేయాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఆలయ ఈవో శేషభారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, మట్టెవాడ సీఐ గోపి, ఎస్సై సాయికిరణ్, ట్రాఫిక్ పోలీసులు, ధర్మకర్తలు టి.వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, కాంత్రి, సతీష్, మయూరి, స్రవంతి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్య దక్షిణ యాత్రకు ప్రత్యేక రైలు

జనగామ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పీవీ వెంకటేశ్ అన్నారు. జనగామ రైల్వే స్టేషన్‌లో గురువారం ఐఆర్‌సీటీసీ టూరిజం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగం, తిరువణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండం, తిరుచ్చి, తంజవూరులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును హైదరాబాద్ నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. జూలై 19 నుంచి జూలై 26 వరకు ప్రయాణం ఉంటుందని ఈ యాత్ర సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడురు మీదిగా రేణిగుంట వెళ్తుందన్నారు. అక్కడి నుంచి ఆలయాలకు ఉచితంగా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఒక్కొకరికి సాధారణ టికెట్ ధర రూ. 14,100, 3ఏసీ రూ.22,300, 2ఏసీ 29,200 ఉంటుందన్నారు. ప్రతీరైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతీ 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లు, కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్ అందుబాటులో ఉంటూ సౌకర్యాలను సమకురుస్తారని తెలిపారు. సీసీ కెమెరాలతో భద్రత, హోటళ్లు, భోజనం, వాటర్ బాటిల్స్ కూడా ఉచితంగా ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 9701360701, 9281030711, 9281030712 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు. అనంతరం తీర్థయాత్రలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. టూరిజం మానిటర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం


సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడుపుతున్న డ్రైవర్

నర్సంపేట టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురైన ఘటన గురువారం నర్సంపేట నుంచి వరంగల్‌కు వెళ్తున్న బస్సులో జరిగింది. సెల్‌ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని ట్రాఫిక్ సిబ్బంది, పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా కొంత మంది డ్రైవర్ల తీరు మారడం లేదు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం క్షేమం అనే భరోసాతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను కాదని ఆర్టీసీని ఆశ్రయిస్తే.. కొంతమంది డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీపై నమ్మకం పోతున్నది. గురువారం ఉదయం 10 గంటల వరకు నర్సంపేట డిపోకు చెందిన టీఎస్ 03 యూబీ 8600 నెంబర్ గల బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. ఇదే సమయంలో బస్సు డ్రైవర్ తన సెల్‌ఫోన్‌లో 20 నిమిషాల పాటు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

గోదావరిలోకి భారీగా వరద నీరు

» ఎగువ నుంచి 94,500 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో » బ్యారేజీలోని 14 గేట్లు ఎత్తి దిగువకు 1,02,400 క్యూసెక్కుల నీళ్లు విడుదల

కన్నాయిగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ ప్రాజెక్టు వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల నుంచి ప్రవహిస్తున్న ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి వరద నీరు భారీగా వచ్చి గోదావరిలో చేరింది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 94,500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో తుపాకులగూడెం బ్యారేజీలోని 14 గేట్లు పైకి ఎత్తి దిగువకు 1,02,400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.925 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఇదిలాఉండగా, మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. ప్రాజెక్టులోని ఫేస్-2లోని రెండు మోటార్ల ద్వారా భూపాలపల్లి జిల్లా భీంఘనపురం రిజర్వాయర్‌కు 494 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. సమ్మక్కసాగర్ వద్ద 79.65 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా, దేవాదుల ఇంటెక్‌వెల్ వద్ద 79.95 మీటర్ల నీటి మట్టం నమోదైంది.


తుపాకులగూడెం బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీళ్లు


కాళేశ్వరం వద్ద ప్రవహిస్తున్న గోదావరి

కాళేశ్వరం వద్ద..

మహదేవపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి 6మీటర్ల 30 సెంటీమీటర్ల వరకు వరదనీరు చేరింది. ఐదు రోజుల నుంచి నదీ ప్రవాహం పెరుగుతూ, తగ్గుతూ వస్తుండగా తాజాగా గురువారం కురిసిన వర్షాలకు ఒక్కసారిగా వరద నీరు చేరి మెట్ల వద్దకు నీరు ఎగబాకింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతుండడంతో వరద నీరు పెద్ద ఎత్తున పెరిగింది.

మేడిగడ్డ బ్యారేజీకి 77,500 క్యూసెక్కుల నీరు

మహదేవపూర్ రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరదనీరు పెరుగుతోంది. బ్యారేజీలోకి 77,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం రెండు మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

ప్రాణం తీసిన పోలీసు భయం

- చల్వాయిలో ఉరివేసుకొని యువకుడి బలవన్మరణం
- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్ట్‌లు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య

గోవిందరావుపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేరు.. అమ్మమ్మే సర్వస్వం.. ఆపై పేదరికం.. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డాడు.. కానీ ఆయన ఆశలు నెరవేరలేదు.. లబ్దిదారుల జాబితాలో పేరు లేకపోవడంతో ఆవేదనకు లోనయ్యాడు.. ఊళ్లోని వాట్సాప్ గ్రూపులో తన బాధను పంచుకున్నాడు.. అయితే ఈ చాటింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకమని భావించిన పోలీసులు ఆ యువకుని మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు.. విచారణ నిమిత్తం స్టేషన్‌కు రావాలని ఆదేశించారు.. భయంతో వణికిపోయిన అతడు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో గురువారం ఉదయం ఈ సంఘటన జరిగింది. పోలీసుల భయంతో చుక్క రమేష్ (29) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. చుక్క స్వరూప-గట్టయ్య దంపతులకు రమేష్, మౌనిక సంతానం. అనారోగ్యంతో స్వరూప, గట్టయ్యలు కొన్నేళ్లక్రితం మృతి చెందారు. మౌనికకు వివాహమై అత్త వారింటికి వెళ్లగా రమేష్ చల్వాయిలోని తన అమ్మమ్మ శెట్టి విశాల వద్ద ఉంటున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసిన ఆయన కొద్దిరోజుల క్రితం చల్వాయికి వచ్చాడు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోగా జాబితాలో పేరు రాలేదు. తనకు అన్ని అర్హతలున్నా ఇల్లును మంజూరు చేయలేదని, అనర్హులకు ఇచ్చారంటూ 'చల్వాయి సమాచారం' అనే వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టాడు.


చల్వాయిలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, బీఆర్ఎస్ నాయకులు

ఇదే గ్రూపులో సభ్యులుగా పస్రా ఎస్సైతోపాటు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభిమానులు ఉన్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల అభిమానులు ఒకరినొకరు విమర్శించుకుంటూ పోస్టులు పెట్టుకున్నారు. మంత్రి సీతక్క, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్త నాగన్న పేరిట సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన లేఖను రమేష్ ఈ గ్రూపులో పోస్టు చేశాడు.

వాట్సాప్ గ్రూపులో పోస్టుల యుద్ధాన్ని పస్రా ఎస్సై కమలాకర్ గమనించారు. ఆయన ఆదేశాలతో బుధవారం సాయంత్రం చల్వాయికి వచ్చిన ఓ పోలీసు కానిస్టేబుల్.. రమేష్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాడు. గురువారం స్టేషన్‌కు రావాలని సూచించాడు. తనపై కేసులు పెడతారేమోనని రమేష్ భయాందోళనకు గురయ్యాడు. అమ్మమ్మ బంధువుల ఇంటికి వెళ్లడంతో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో రమేష్ దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింట్లో ఉండే అలుగం రమేష్ అనే వ్యక్తి గమనించి చుట్టుపక్కల వారికి తెలిపాడు. విషయం తెలుసుకున్న పస్రా ఎస్సై కమలాకర్ చల్వాయికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇంట్లో వెతకగా రమేష్ రాసిన సూసైడ్ నోట్ లభ్యమైనట్లు తెలిసింది. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న మనవడు ఆత్మహత్య చేసుకోవడంతో అమ్మమ్మ విశాల గుండెలవిసేలా రోదించింది.

రమేష్‌ది ప్రభుత్వ హత్య

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, జర్నలిస్టులు, సామాన్యులపై రాష్ట్రమంత్రి సీతక్క అనుచరులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంపై నిలదీసిన రమేష్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే పొట్టనపెట్టుకుందని ధ్వజమెత్తారు. ములుగు ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్ద రమేష్ మృతదేహానికి నివాళులర్పించిన ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. అమాయక యువకుడి మృతికి మంత్రి సీతక్క బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మృతదేహంతో ఆందోళన

కాంగ్రెస్ నాయకులు, పోలీసుల కారణంగానే చుక్క రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు రమేష్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించిన వారిపై భౌతికదాడులకు పాల్పడటమేకాక ఆత్మహత్యకు ప్రేరేపించేలా భయభ్రాంతులకు పాల్పడటం ములుగు జిల్లాలో కాంగ్రెస్ నాయకులకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ములుగు సర్కిల్ పోలీసులు కూడా చల్వాయిలో మోహరించారు. రాస్తారోకో ప్రభావంతో రహదారికి ఇరువైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళనను విరమింపజేసిన పోలీసులు రమేష్ మృతదేహాన్ని ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ మృతుడి అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ.50వేలు అందజేశారు.

వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు

చుక్క రమేష్ అమ్మమ్మ శెట్టి విశాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాట్సాప్‌లో అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధించి రమేష్ ఆత్మ హత్యకు కారణమైన చల్వాయికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ న్యూసెన్స్ అంశంపై బుధవారం సాయంత్రం డయల్ 100కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా పస్రా పోలీసులు చల్వాయికి వెళ్లారని, మద్యం సేవించిన స్థితిలో రమేష్ ఉన్నట్లు గుర్తించి తిరిగి వెళ్లిపోయారని తెలి పారు. మృతుడు రమేష్‌పై ఎటువంటి కేసు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.

రవీందర్, ములుగు డీఎస్పీ


shanthi TALKIES
MYTHRI
RELEASING TODAY
SIDDHARTH
SARATH KUMAR
3BHK
'Every Ordinary Family has an Extraordinary Story'
WRITER - DIRECTOR SRI GANESH
PRODUCED BY ARUN VISWA


ప్రపంచవ్యాప్తంగా
నేడే
విడుదల
జురాసిక్ వరల్డ్
రీబర్త్
IN CINEMAS JULY 4
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU
IN 3D
UNIVERSAL


ANIL SUNKARA PROUDLY PRESENTS
SKYLINE MOVIES
SHOW TIME
నేడే
విడుదల
WRITTEN & DIRECTED BY
MADHAN DAKSHINAMOORTHY
PRODUCER
KISHORE GARIKIPATI (G K)


ప్రపంచవ్యాప్తంగా
జూలై
11
విడుదల
IT BEGINS
A JAMES GUNN FILM
DC STUDIOS
సూపర్‌మ్యాన్
SUPERMAN
ONLY IN CINEMAS JULY 11
IN ENGLISH, HINDI & TELUGU
IN 3D & IMAX 3D
REAL D 3D Dolby Cinema IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


SMT.ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
T-SERIES MUSIC
నేడే
విడుదల
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR

హక్కుల కోసం ప్రభుత్వాలపై పోరాడుదాం

మహబూబాబాద్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): లంబాడీల హక్కుల కోసం ప్రభుత్వాలపై పోరాడుదామని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి కోట్యానాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ఆవరణలో ఎల్‌హెచ్‌పీఎస్(నంగారబేరి) 29వ ఆవిర్భావ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంగోతు చందులాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథి కోట్యానాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన లంబాడీలకు మంత్రివర్గంలో చోటు కల్పించకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం గోరుబోలి బాషను అధికారికంగా గుర్తించి 8వ షెడ్యూల్‌లో చేర్చేంత వరకు ఎల్‌హెచ్‌పీఎస్ పోరాడుతుందని చెప్పారు. ఎస్టీల రిజర్వేషన్ 7 శాతం నుంచి 14 శాతంకు పెంచాలని డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ రుణాలు, బెస్ట్ అవెలబుల్ స్కీం నిధులను తక్షణమే విడుదల చేసి ఆదుకోవాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలన్నారు. మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ మాట్లాడుతూ... లంబాడీలంతా కలిసికట్టుగా ఉంటూ హక్కులను సాధించు కోవాలన్నారు. లంబాడల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరినాయక్, బోడ లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచ్ భూక్య నెహ్రూనాయక్, గుగులోతు వెంకట్, రాంమూర్తి, బోడ చందులాల్, రవి, శ్రీనివాస్, రమేష్, వెంకన్న, పవన్, మంగిలాల్, ఉదయ్, విజయ పాల్గొన్నారు.



ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావ సభలో అభివాదం చేస్తున్న సంఘం నేతలు, ఎమ్మెల్యే మురళీనాయక్

క్షయ నివారణకు చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా క్షయ నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సూచించారు. న్యూఢిల్లీ నుంచి టీబీ ముక్తి భారత్ అభియాన్‌పై అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దేశంలో క్షయ వ్యాధిని 2030 వరకు నివారించాలనే ఉద్దేశ్యంతో దేశ వ్యాప్తంగా ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నివేదిస్తూ.... జిల్లాల్లో దగ్గు, జలుబు, చాతిలో నొప్పి, తెమడలో రక్తం పడడం, నీరసం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం లాంటి లక్షణాలున్న వారికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ శాఖలు పంచాయతీ, విద్య, గ్రామీణాభివృద్ధి, ఐసీడీఎస్, మునిసిపాలిటీ, మెప్మా శాఖల సమన్వయంతో ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 171 ఆయూష్మాన్ ఆరోగ్యమందిర్‌ల ద్వారా రెండు టీములుగా విభజించి తెమడ పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. చికిత్స తీసుకున్న క్షయ వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో ఆరు నెలలకు సరిపడ ఫుట్ బాస్కెట్స్ అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు రవిరాథోడ్, శ్రీనివాస్, జగదీష్, బి. వెంకట్రాములు, ప్రమీలరావు, సుధీర్, డీఈవో రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జీ డీడబ్ల్యూవో శిరీష పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, వైద్యాధికారులు



మార్కెట్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

మార్కెట్ సిబ్బంది నిరసన

కేసముద్రం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిపై అక్కడి వైస్ చైర్మన్ చేసిన దాడిని ఖండిస్తూ కేసముద్రం మార్కెట్లో గురువారం ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వైస్ చైర్మన్‌పై కేసు నమోదు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, గ్రేడ్3 కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పీరీల ఊరేగింపు



ఇనుగుర్తిలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

ఇనుగుర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మొహరం సందర్భంగా పీరీల ఊరేగింపు కొద్దిరోజులుగా కొనసాగుతోంది. గ్రామంలోని వీధుల వెంట పీరీలను తిప్పుతుండడంతో ఇంటింటికి పలువురు కులమతాలకతీతంగా పూజలు చేస్తున్నారు. గురువారం నిర్వహించిన పీరీల ఊరేగింపులో ముజావర్లు ఎండీ.రహీం,యాకూబ్‌పాషా, మహబూబ్ పాషా, ఖాజాపాషా, ఇమాం, వజీర్, రహీం, బబ్లు, కరీం, ఆసీఫ్, అనీల్, రాజు, వెంకన్న, బిక్షపతి, రమేష్ పాల్గొన్నారు.

పగిడిద్ద రాజు తిరుగువారం తేదీలు ఖరారు

గంగారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైన సమ్మక్క భర్త పగిడిద్ద రాజు తిరుగువారం జాతరను ఆలయ ప్రధాన పూజారి పెనక బుచ్చిరాములు గురువారం ప్రకటించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకో సారి జరిగే సమ్మక్క, సారమ్మ మహా జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి జరుగుతుందని సమ్మక్క, సార్లమ్మ ఆలయ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ప్రకటించిన విషయం విదితమే. సమ్మక్క భర్త అయిన పగిడిద్దరాజు తిరుగువారం జాతర తేదీలను పగిడిద్ద రాజు ఆలయ ప్రధాన పూజారి పెనక బుచ్చిరాములు కూడా ప్రకటించారు. 2026వ సంవత్సరం ఫిబ్రవరి 4న ఉపవాసం, గడిలో ప్రత్యేక పూజలు అదేరోజు గుట్టనుంచి గుడికి పగిడిద్ద రాజు వచ్చుట, 5న గద్దెపైకి వనం వచ్చుట, పగిడిద్ద రాజు స్వామివారి ఊరేగింపు, గంగాస్నానం ఉంటుందని తెలిపారు. 6న మొక్కులు చెల్లింపులు అనంతరం వనప్రవేశంతో జాతర ముగుస్తుందని ఆయన తెలిపారు.

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు

(5వ పేజీ తరువాయి)

మొక్కులు చెల్లించారు. తదనంతరం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశ మందిరంలో మహా జాతర అభివృద్ధిపనులపై సంబంధిత అధికారులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వాస్తుశిల్పి రాజశేఖర్ మేడారం మాస్టర్ ప్లాన్‌ను స్లైడ్ షో ద్వారా పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ స్లైడ్ షోలో జంపన్నవాగు అభివృద్ధి పనులు, పలు వంతెనల ఏర్పాటు, అధునాతన కూడళ్ల ఏర్పాటు, రోడ్డు విస్తరణ పనులు, దేవస్థానం చుట్టూ అభివృద్ధి, భక్తుల కోసం విశాలమైన క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు, భక్తుల వసతి, పూజారుల వసతి, గిరిజన సంఘాల వసతి, స్నాన ఘట్టాలు, అన్నదాన సత్రాలు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటు, గద్దెలు, పరిసరాలు ముఖ ద్వారాలు రాతి కట్టడాలతో నిర్మించేలా చేసిన డిజైన్‌లను చూపించారు.

అనంతరం శైలజారామయ్యర్ మాట్లాడుతూ 2026 మహా జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉన్నత సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. 100 ఏళ్లకు పైగా నిలిచి ఉండేలా శాశ్వత నిర్మాణాలు చేపడతా మన్నారు. మేడారం అభివృద్ధికి పూజారులు, దేవాదాయ శాఖ, గిరిజన శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి, వారికి సులువైన దర్శనం అయ్యేలా చూడాలన్నారు. తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఆధ్యాత్మికత పెంపొందేలా అభివృద్ధి చేపడతామని అన్నారు. గిరిజనులు, పూజారులకు ఏమైనా సందేహాలు ఉంటే తెలియజేయాలన్నారు. అభివృద్ధి పనులకు ఆరు నెలల సమయం ఉందన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగేలా శాశ్వత పనులకు ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడారం అభివృద్ధి జరగాలంటే భూసేకరణ ప్రధానమన్నారు. మేడారం గిరిజనులు, పూజారులు భూసేకరణకు అడ్డు పడకుండా సహకరించాలని కోరారు.

చెరువు కాలువల పనులు షురూ

బయ్యారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు కాలువల మరమత్తు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అంతకు ముందు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 21 మంది కల్యాణలక్ష్మీ లబ్దిదారులకు, 19 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓఅండ్ఎం గ్రాంట్ కింద కాలువల మరమత్తు పనులకు రూ. 35 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమైయ్యే నాటికి కాలువల మరమత్తు పనులు పూర్తి చేసేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో బయ్యారం తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయలక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునలయ్య, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్ నాయక్, వెంకటపతి పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

సీపీఐ పట్టణ కార్యదర్శిగా పెరుగు కుమార్

మహబూబాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పట్టణ కార్యదర్శిగా కొండపల్లి గోపాల్‌రావునగర్ కాలనికి చెందిన పెరుగుకుమార్ తిరిగి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా శిఖారఖానగడ్డకు చెందిన రేషపల్లి నవీన్, కొండపల్లి గోపాల్‌రావునగర్ కాలనీకి చెందిన చింతకుంట్ల వెంకన్న ఎన్నికయ్యారు. మహబూబాబాద్ పట్టణంలోని పేరాల కట్టయ్య పంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన సీపీఐ పట్టణ 14వ మహాసభలో జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారధిరెడ్డి ఆధ్వర్యంలో 95 మందితో పట్టణ సమితిని ఎన్నుకోగా స్థానిక వీరభవన్‌లో గురువారం కమిటీని ప్రకటించారు. ఇందులో కార్యదర్శి వర్గ సభ్యులుగా ఏనిమిది మందిని పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎమ్డీ. ఫాతిమా, నర్రా శ్రావణ్‌లను ఎన్నుకున్నారు. కాగా కార్యదర్శిగా ఎన్నికైన పెరుగుకుమార్ 1998లో అఖిల భారత విద్యార్థి పేడరేషన్ (ఏఐఎస్ఎ‌ఫ్)లో చేరి విద్యార్థి, తెలంగాణ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేశారు. ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ మహబూబాబాద్ మండల సహాయ కార్యదర్శిగా పని చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శిగా రెండు దఫాలు పని చేసి పట్టణ సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్నారు. తన ఎన్నికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పెరుగుకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



ప్రధాని మోదీ విధానాలపై సమరశంఖం పూరించాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న ,సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు కొత్తపల్లి రవి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సనప సోమయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాధం భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అధ్యక్షతన గురువారం కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టెబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కార్మికులు పోరాడి ఏనిమిది గంటల పని దినాన్ని సాధించుకుంటే ప్రధాని మోదీ దానిని 12 గంటలు చేయాలని కొత్తగా నాలుగు లెబర్‌కోడ్‌లను తీసుకువస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస అవసరాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి జీవితాలతో చెలగాట మాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల కడుపులు కొట్టి కార్పొరేట్లకు దోచిపెడుతుందని ఆరోపించారు. జూలై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు కుంట ఉపేందర్, శివ్వారపు శ్రీధర్, నవీన్, సూర్యం, బాస్కర్‌రెడ్డి, కోటేష్, లింగన్న, రాజమౌళి, నాగన్న రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సుధాకర్, దేవేందర్, వెంకటేశ్వర్లు, రాంమూర్తి, మధు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గుండు సులోచన డిమాండ్ చేశారు. ఈమేరకు మహబూబాబాద్‌లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ జిల్లా అధికారి శిరీషకు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సులోచన మాట్లాడుతూ...సెల్ ఫోన్‌లు ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌కు సపోర్టు చేయకపోవడంతో గర్భిణీలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రతి రోజు యాప్‌లో నమోదు చేయకుండా నెలకు ఒకసారి చేసే విధంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి హేమ, సుజాత, విజయ, సరోజ, వనజ, కనకలక్ష్మీ, రోజా, లీలావతి, తార, ఉపేంద్ర, లలిత, సరస్వతి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి దరఖాస్తు గడువు పొడగింపు

మహబూబాబాద్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల ఉపకరణాల ఉచిత పంపిణీకి దరఖాస్తు గడువు ఈనెల 5 వరకు పొడిగించినట్లు జిల్లా ఇన్‌చార్జి సంక్షేమాధికారి శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక అంగవైకల్యం, అంధులకు, మానసిక దివ్యాంగుల కోసం రెట్రోఫిటెడ్ మోటార్ వెహికిల్స్‌బ్యాటరీ, వీల్‌చైర్, మొబైల్ బిజినెస్, బ్యాటరీ ట్రైసైకిల్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికిల్, డిగ్రీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, 5జీ స్మార్ట్ ఫోన్‌లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ : 89786 98912 ను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మహబూబాబాద్ రూరల్ , జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లికి చెందిన గట్ల కరుణాకర్‌రెడ్డి (40) అనే రైతు గురువారం విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కేడే మృతి చెందాడు. మహబూబాబాద్ రూరల్ ఏఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం. ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డికి రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయం చేయడంతో పాటు విలేజ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తన వ్యవసాయ బావి వద్ద వరినారు పోసేందుకు స్టార్టర్ బిగిస్తుండగా మోటార్ నుంచి స్టార్టర్‌కు వచ్చే కరెంట్ వైరు తెగి మీదపడడంతో విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కేడే మృతి చెందాడు. చుట్టు పక్కల రైతులు చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం కరుణాకర్‌రెడ్డి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి

● పొలానికి నీరు పెట్టి వస్తుండగా ఘటన

కురవి, జులై 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామంలో పాముకాటుతో గోదాసి వర్ధయ్య (65) అనే రైతు గురువారం మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. వర్ధయ్య ఉదయం తమ వరికి నీరు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా వర్ధయ్యను పాము కాటువేసింది. ఆయన ఇంటికి చేరుకుని కుమారులకు విషయం చెప్పడంతో అతన్ని హుటాహుటిన మహబుబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ వర్ధయ్య మృతి చెందాడు. పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతుడి భార్య గతంలోనే మృతి చెందగా, ఇద్దరు కుమారులు రామ్మూర్తి, సైదులు, కుమార్తె ఉన్నారు.

కొనసాగుతున్న 'నారాయణపురం' దీక్షలు

కేసముద్రం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురంలో ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు గురువారం మూడో రోజు రైతులు నిర్వహించారు. ఈ దీక్షల్లో రైతులు ధరావత్ రవి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, అమరేంతర్‌రెడ్డి, పద్మ, వాల్యా, లచ్చు, చుక్కారెడ్డి, సంజీవరెడ్డి, రాజేష్, వీరన్న, సరోజనమ్మ, నాగమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

బయ్యారంలో దాడి : కేసులు నమోదు

బయ్యారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ఘటనలకు సంబంధించి బయ్యారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రెండు దాడి కేసులు నమోదైనట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. తన అవసర నిమిత్తం ద్విచక్రవాహనం కుదువపెట్టి గోవర్ధన్ అనేవ్యక్తి ప్రదీప్ వద్ద రూ. 60వేలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి అప్పు అడిగే క్రమంలో ప్రదీప్, శశిధర్‌రెడ్డి, నాగరాజులు ముగ్గురు కలిసి గోవర్ధన్‌పై దాడికి పాల్పడగా.. గోవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రదీప్, శశిధర్‌రెడ్డి, నాగరాజుపై దాడి కేసుచేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు వెల్లడించారు.

అదే విధంగా గంధంపల్లి గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి తన ఇసుక వ్యాపారానికి అడ్డుతగులుతూ అక్కసుతో వార్తలు ప్రసారం చేస్తున్నాడనే కోపాన్ని మనుసులో పెట్టుకొని మరో ఇరువురు సాయి, కార్తీక్‌తో కలిసి ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన విలేకరి నరసింహారావుపై కర్రలతో దాడికి పాల్పడుతూ హత్యాప్రయత్నానికి ఒడిగడుతారు. ఈ ఘటనలో నరసింహా రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సురేష్, సాయి, కార్తీక్‌పై హత్యాప్రయత్నం కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వేర్వేరు ఘటనలో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొత్తం ఆరుగురిపై కేసు నమోదైనట్లు ఎస్సై వెల్లడించారు.

గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

గార్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పౌరసరఫరాల గోదాంలో రేషన్ బియ్యం రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్ టి.యేసు(51) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వారం రోజుగా నిద్రహారాలు మాని రేషన్ బియ్యం రవాణా చేస్తుండటంతో ఆరోగ్యం నీరసించింది. దీంతో గుండెపోటు రావడంతో ఇంటివద్దే కుప్ప కూలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

గార్ల జూలై 3 (ఆంధ్రజ్యోతి) : వివాహం చేసుకున్న భర్త, పక్కంటి యువకుడు ప్రేమపేరుతో వేధిస్తుండడంతో తీవ్ర మనస్థాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన గార్ల మండలం ముల్కనూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఎస్సై రీయాజ్ పాషా తెలిపిన వివరాల ప్రకారం. ముల్కనూరుకు చెందిన ఎదుల సతీష్‌కుమార్‌కు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు చెందిన శైలజతో 8 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. ఐదు సంవత్సరాల పాటు వీరి కాపురం సాఫీగా సాగింది. ఇద్దరు సంతానం కలిగిన తర్వాత అదే వీధిలో ఉండే యువకుడు కంపటి శ్రీరాం శైలజ(35)ను ప్రేమపేరుతో వేధించసాగాడు. ఈ విషయం భర్త సతీష్‌కుమార్‌కు తెలియడంతో భార్యను అనుమానంలో వేధింపులకు గిరిచేయ సాగాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన శైలజ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఎలుకల మందు తాగింది. దీంతో కుంటుంబ సభ్యులు ఆమెను మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి శైలజ మృతి చెందింది. మృతురాలు తల్లి కవిత ఫిర్యాదు మేరకు సతీష్‌కుమార్, వేధింపులకు పాల్పడిన శ్రీరాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సభకు వచ్చే వారికి ఇబ్బందులు కలుగవద్దు

మహబూబాబాద్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం పర్వతగిరిలో ఈనెల 6న నిర్వహించనున్న సభకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నారని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. పర్వతగిరి గ్రామంలో నిర్వహించనున్న సభాస్థలాన్ని గురువారం స్థానిక ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పర్వతగిరి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్, బేతోలు నుంచి సోమ్లాతండా వరకు బీటీ రోడ్డు శంకుస్థాపనకు చేస్తారని వివరిం చారు. అనంతరం పర్వతగిరిలో జరిగే సభకు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్, పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చే ప్రజలకు మజ్జిగ, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎక్కడ కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు చేయాలనా ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, టీపీసీసీమాజీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మానుకోట మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమ, యూత్ అధ్యక్షుడు అజ్మీరా సురేష్, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, ఎడ్ల రమేష్, పద్మం ప్రవీణ్, ఇస్లావత్ బాలాజీ, రాంచందర్, నర్సింగం శ్రీనివాస్, డీఎస్పీ తిరుపతి రావు, సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

తొర్రూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ వంతు సహకారం అందించాలని ఎంఈవో మహంకాళి బుచ్చయ్య అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రాజసుకన్య జన్మదినం సందర్భంగా రూ.5వేలు విలువ చేసే భోజన ప్లేటు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తామని తెలిపారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, ప్రవీణ్ కుమార్, సంధ్యారాణి, శిరీష, యమున, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించకుంటే చర్యలు

మహబూబాబాద్ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రమీల రావు హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్ (డైక్) సెంటర్ గురువారం సందర్శించారు. ఆఫీస్‌లో రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడారు. వైద్యులు శాలిని, వసుమతి, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, డీఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లా.! బుక్ స్టాళ్లా!!

(5వ పేజీ తరువాయి)

చదివించాలనే తల్లిదండ్రులకు ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధికంగా ఫీజులు పెంచడంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారింది. అధిక ఫీజులను నియంత్రించాల్సిన అధికారులు సైతం తమకేమి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తూ పాఠశాలల వైపు కన్నెత్తి చూడటంలేదని విద్యార్థి సంఘాల నేతలు, తల్లిదండ్రులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. దీంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల మోత మోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై దృష్టి సారించి నివారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మార్ట్‌లో వస్తువుల చోరీ

• సీసీ ఫుటేజీలతో పట్టుకున్న సిబ్బంది

కేసముద్రం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలోని ఓంసాయి ఏ మార్ట్‌లో గురువారం సరుకులను చోరీ చేస్తున్న ఓ మహిళను సిబ్బంది పట్టుకున్నారు. గతనెల 12న ముగ్గురు గుర్తుతెలియని మహిళలు మార్ట్‌లో ఉన్న ఎనిమిది టీపొడి డబ్బాలు ఎత్తుకెళ్లారు. మార్ట్‌లోని సరుకుల నిల్వల్లో తేడా రావడంతో సీసీ ఫుటేజీని పరిశీలించగా మహిళలు ఎత్తుకెళ్లిన విషయాన్ని గుర్తించారు. దీంతో తాజాగా సిబ్బంది నిఘా పెట్టగా సబ్బును చోరీ చేసిన మహిళను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నర్సింహులపేట మండలం ముంగిమడుగుకు చెందిన సదరు మహిళతోపాటు గత వారం వచ్చిన వారు కూడా తమ వారేనని ఆమె వెల్లడించినట్లు మార్ట్ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.5వేల విలువైన సరుకులు చోరీకి గురైనట్లు మార్ట్ యాజమాన్యం తెలిపారు. టీపొడి, సబ్బు చోరీ చేస్తున్న సీసీ ఫుటేజీలు స్థానిక సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

'ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి మునగాల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని వివేకానంద సెంటర్‌లో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల్లో బంద్ నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియింబర్సుమెంట్, స్కాలర్ షిప్ బకాయిలు సుమారు రూ. 7200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, ఆసిప్, శేఖర్, సురేష్, చంటి, సుప్రియ, అనూష పాల్గొన్నారు.